## క్లుప్తంగా

### ముదిరాజుల హక్కులను కాపాడాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ముదిరాజ్‌లు

సారంగాపూర్: చట్టపరంగా తమకు సంక్రమించిన హక్కులను కాపాడాలని, తమ హక్కులకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన ముదిరాజ్‌లు సారంగాపూర్ తహసీల్దార్ తాఫాజుల్లా హుస్సేన్‌కు ఫిర్యాదు చేశారు. లక్ష్మీదేవిపల్లిలోని కుంటలు, చెరువుల్లో చేపలు పెంచుకునే హక్కును తాము కలిగి ఉన్నామని, దీంతో పాటు సీతాఫలాలు తెంపి అమ్ముకునే హక్కు తమకే ఉందని, దీనిపై ఓ వర్గానికి చెందిన వారు ఈ హక్కులు మీకు ఎలా సంక్రమిస్తాయని మాతో గొడవకు దిగుతున్నారని, దీనిపై తమ వద్ద ఉన్న అన్ని పత్రాలను పరిశీలించి తమ హక్కులకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

### అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు



పట్టుకున్న మద్యంతో ఎక్సైజ్ సీఐ, సిబ్బంది

జగిత్యాలక్రైం: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో, పట్టణాల్లో బెల్టుషాపుల నిర్వాహకులు అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మేడిపల్లి మండలం కట్లకుంట గ్రామానికి చెందిన గోలి రమేశ్ అనే వ్యక్తి వద్ద రూ.68,805 విలువ గల 62.55 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం జగిత్యాల ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో మాట్లాడారు. బెల్టుషాపులు నిర్వహించినా, అనధికారికంగా మద్యం విక్రయాలు చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సైలు రవి, సరిత పాల్గొన్నారు.

### కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం



ప్రచారం చేస్తున్న నాయకులు

మేడిపల్లి: భీమారం మండలంలోని రాజలింగంపేట, రత్నాలపల్లె గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో ఆది శ్రీనివాస్ ని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సింగిరెడ్డి నరేశ్ రెడ్డి, తోకల నర్సయ్య, జంగంపల్లి విజయ్, ముంచ కిషన్, నీరిటి మల్లేశం, గంగరాం, అరుణ్, పాల్గొన్నారు.

### బతుకమ్మ విగ్రహం ఏర్పాటు



బతుకమ్మకుంట వద్ద ఏర్పాటు చేసిన విగ్రహం

సారంగాపూర్: మండల కేంద్రంలోని బతుకమ్మ కుంట వద్ద శనివారం బతుకమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. నెల రోజుల క్రితం పనులు ప్రారంభించగా ఆదివారం సద్దుల బతుకమ్మ కావడంతో విగ్రహా ఏర్పాటు పనులను పూర్తి చేసినట్లు సర్పంచ్ రాజేందర్‌రెడ్డి తెలిపారు. కాగా ఈ కుంటకు ఇప్పటికే బతుకమ్మ ఘాట్‌ల నిర్మాణం పూర్తి చేశారు.. అటవీప్రాంతంలో ఈ కుంట ఉండడంతో కొత్త అందాలు సంతరించుకున్నాయి.

### హ్యాండ్‌బ్యాగ్ అప్పగింత

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం రాములపల్లి గ్రామానికి చెందిన బర్ల మమత మూడు రోజుల క్రితం జగిత్యాలకు షాపింగ్‌కు వచ్చి తన హ్యాండ్‌బ్యాగ్ పోగొట్టుకుంది. దీంతో ఆ హ్యాండ్‌బ్యాగ్ జగిత్యాలకు చెందిన మారుపాక రాజేందర్‌కు దొరకగా శనివారం మమతకు పట్టణ పోలీసుల సమక్షంలో అందజేశారు.



జగిత్యాల రూరల్: అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే



తాట్లవాయిలో చండీయాగంలో పాల్గొన్న భక్తులు



కథలాపూర్: దుర్గామాతకు పూజలు చేస్తున్న లోక బాపురెడ్డి, నాయకులు, నిర్వాహకులు

# అమ్మవారికి ప్రత్యేక పూజలు, భక్తులకు అన్నదానాలు

జగిత్యాల రూరల్/జగిత్యాల టౌన్/రాయికల్/ కథలాపూర్/ మల్లాపూర్/ధర్మపురి: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జగిత్యాల రూరల్ మండలం మోరపల్లిలో శ్రీ నవదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను శనివారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని భక్తమార్కండేయ ఆలయంలో అమ్మవారు ఏడోరోజు శనివారం బాలాత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. కనకదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో అష్టలక్ష్మి ఆలయంలో కాళరాత్రి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాయికల్ పట్టణంతో పాటు, మండలంలోని తాట్లవాయి, కుమ్మరిపల్లి, అల్లీపూర్, భూపతిపూర్, బోర్నపల్లి గ్రామాల్లో దుర్గామాత వద్ద శనివారం కుంకుమపూజలు నిర్వహించారు. తాట్లవాయిలో చండీయాగం నిర్వహించారు. మల్లాపూర్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారికి మహిళలు బోనాలు చేశారు. కుస్తాపూర్‌లో మహిళలు కుంకుమపూజలు చేశారు. సాతారంలో దుర్గాదేవి-రాజరాజేశ్వర స్వామి వారి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ధర్మపురిలో నవదుర్గా సేవాసమితి ఆధ్వర్యంలో అమ్మవారికి బోనాలు చేశారు. వేడుకల్లో మంత్రి కొప్పుల ఈశ్వర్ పాల్గొన్ని, అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.



ధర్మపురిలో దుర్గమ్మ బోనాల వేడుకల్లో మహిళలు, చిన్నారులు



ఇబిక్యాలలో దుర్గామాతకు పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



సాతారంలో అమ్మవారి కల్యాణం



బాలాత్రిపుర సుందరి రూపంలో అమ్మవారు

# దుర్గమ్మ కృపతో మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారం

- ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

మల్లాపూర్: దుర్గాదేవి అమ్మవారి కృపతో రాష్ట్రంలో మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే వస్తుందని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగరరావు అన్నారు. మండలంలోని రాఘవపేటలో నవరాత్రోత్సవాలలో ఏర్పాటు చేసిన దుర్గమండపంలో శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. భవానీమాత కృపతో శాసనసభ ఎన్నికల్లో 100కుపైగా స్థానాలు గెలిచి కేసీఆర్ మూడోసారి సీఎం పదవిని చేపడుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, సర్పంచ్ నత్తి లక్ష్మి, ఉపసర్పంచ్ ఎండీ.అమినొద్దీన్, బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ నాయకుడు బైరి రవికుమార్‌యాదవ్, రైతుబంధు కమిటీ కన్వీనర్ దేశెట్టి నాగేశ్, బైరి రాకేశ్‌యాదవ్, కుదుముల గణేశ్, గురిజేల లక్ష్మీనారాయణ, గంధం రమేశ్, లోక రవి, రాజేశ్, మద్దెల స్వామి, సూర రాము, మెండె లక్ష్మణ్, కొక్కు అశోక్, హరీశ్, మండల తిరుపతి, గాజుల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# హామీలు నెరవేర్చిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదే



మాట్లాడుతున్న లోక బాపురెడ్డి

కథలాపూర్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి అన్నారు. శనివారం కథలాపూర్ మండలం భూషణరావుపేటలో గడప గడపకు బీఆర్‌ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని అన్ని వాడల్లో తిరిగి ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమ నేత సీఎం కావడంతో ప్రజల అకాంక్ష మేరకు సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను ప్రజలను నమ్మవద్దన్నారు. మహిళల కోసం ప్రత్యేక పథకాలు అమలు చేసేందుకు సీఎం కేసీఆర్ సిద్ధంగా ఉన్నారన్నారు. మూడోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు మద్దతు ఇస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు గడీల గంగప్రసాద్, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు గంగారెడ్డి, ఎంపీటీసీ కొండ ఆంజనేయులు, ఏఎంసీ డైరెక్టర్ కొత్తపెల్లి శ్రీనివాస్, నాయకులు బద్దం మహేందర్‌రెడ్డి, గడ్డం భూమారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# దొడ్డు బియ్యమా.. ప్లాస్టిక్ బియ్యమా..!



ఉడకబెట్టిన అనంతరం రేషన్ బియ్యపు అన్నం

మల్యాల: మండలంలో రేషన్ దుకాణాల్లో పంపిణీ చేసే బియ్యం మునుపెన్నడు లేనివిధంగా దొడ్డురకంగా రావడంతో వినియోగదారులు బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం ఏమైనా కలిశాయా అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అన్నం ఉడికించేటప్పుడు బియ్యం పైన తేలుతున్నాయని, అన్నం ఉడికిన తర్వాత కూడా ప్లాస్టిక్ బియ్యం లాగా సాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ దుకాణాల్లో పంపిణీ చేసే బియ్యంపై అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో తుట్టెలు కట్టిన బియ్యం, పుచ్చుపట్టిన బియ్యం పంపిణీ చేస్తున్నారని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.బియ్యం ఉడికించేటప్పుడు బియ్యం గింజలు పైకి తేలుతున్నాయని, ఉడికి తర్వాత సాగుతోందని ప్లాస్టిక్ బియ్యం మాదిరిగా బియ్యం ఉన్నాయని తాటిపల్లి గ్రామానికి చెందిన సింగనవేని మల్లేశం తదితరులు వాపోయారు.

# శిథిలమవుతున్న సెంట్రల్ లైటింగ్ డివైడర్లు



నాసిరకం పనులతో కూలిపోతున్న డివైడర్లు

బుగ్గారం: మండల కేంద్రంలో నూతన మౌలిక సదుపాయాలు కల్పించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడానికి మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక చొరవతో డబుల్ రోడ్డు, నూతన డ్రెయినేజీ,సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టడంతో గ్రామానికి నూతన శోభ వచ్చింది. అయితే వాటి నిర్మాణాల్లో నాణ్యతా లోపాలు ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవలే వర్షం కురిసిన సందర్భంలో డ్రెయినేజీ కూలిపోయింది. అంతేకాకుండా ప్రధాన రహదారిపై డివైడర్లు నాసిరకంగా నిర్మించడంతో పలుచోట్ల సిమెంట్ ఊడిపోతూ డివైడర్లు అధ్వానంగా తయారవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. నిర్లక్ష్యం వహించిన అధికారులపై, నాసిరకం పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

### విద్యుత్ బకాయిలు చెల్లించాలి



రికార్డులు పరిశీలిస్తున్న రాజిరెడ్డి

వెల్గటూర్: విద్యుత్ వినియోగదారులు బకాయిలను చెల్లించి సంస్థకు సహకరించాలని జగిత్యాల డివిజనల్ ఇంజినీర్ ఆపరేషన్ రాజారెడ్డి అన్నారు. వెల్గటూర్‌లో శనివారం సెక్షన్ కలెక్షన్ సెంటర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ బకాయిలను వసూలు చేయాలని, ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కువ కాలిపోతున్నందునా ట్రాన్స్‌ఫార్మర్ టీసీ ఫ్యూజ్‌లు వేయాలని, అనధికార లోడ్లను క్రమబద్ధీకరించాలని కోరారు. ఓవర్ లోడ్ ఉన్న చోట అడిషనల్ ట్రాన్స్‌ఫార్మర్ వేయాలని సూచించారు. పంట కోతలు పూర్తయ్యాక 11 కేవీ సైడ్ హెచ్.జీ. ఫ్యూజ్‌లు ఉంచి ఎల్.టీ. సైడ్ తీసివేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ శ్రీనివాస్, విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### కొనుగోలు కేంద్రాలకు చేరుతున్న ధాన్యం



అర్పపల్లిలో ఆరబోసిన ధాన్యం

సారంగాపూర్: మండలంలో వానాకాలం (ఖరీఫ్) వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే 30 శాతం వరకు సాగుచేసిన పొలాలు కోతలకు రాగా, మరో నెల రోజుల్లో దొడ్డు రకాలు పూర్తిగా కోతకు వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. అర్పపల్లి, పెంబట్ల తదితర గ్రామాల్లో వరి కోతలు వేగవంతమయ్యాయి. దీనిపై ఇప్పటికే ఉన్నతాధికారులు మండలస్థాయి అధికారులతో ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు.

### నేడు సద్దుల బతుకమ్మ

రాయికల్: పట్టణంలో ఆదివారం సద్దుల బతుకమ్మ, సోమవారం దసరా పండగను జరుపుకోనున్నట్లు అర్చకులు రమేశ్‌శర్మ తెలిపారు. మండల, పట్టణ ప్రజలు గమనించాలని కోరారు.

# పోలీస్ అమరుల త్యాగాలు మరువలేం



అమరులకు నివాళి అర్పిస్తున్న సీఐ, ఎస్సైలు

ధర్మపురి: విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమరుల త్యాగాలను మరువలేనివని సీఐ రమణమూర్తి అన్నారు. పోలీస్ అమర వీరుల సంస్మరణ వేడుకల్లో భాగంగా ధర్మపురి పోలీస్ స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన పోలీస్ అమరుల శాంతి స్థూపం వద్ద సీఐ ఆధ్వర్యంలో పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అమర వీరుల శాంతి స్థూపానికి పూలు వేసి జోహార్లు అర్పించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సు కోసం రాత్రింబవళ్లు కంటికి రెప్పలా కాపాడుతున్న పోలీస్ వ్యవస్థకు సమాజంలో ఒక నిర్దిష్టమైన గౌరవం ఉంటుందని శాంతి భద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న పోలీసుల సేవలు ఎంతో గొప్పవని కొనియాడారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఎస్సైలు దత్తాత్రి, రామకృష్ణ, సందీప్, నరేశ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

**భారత్ సురక్షా సమితి ఆధ్వర్యంలో ఫ్లాగ్‌డే**

జగిత్యాలటౌన్: భారత్ సురక్షా సమితి ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. శనివారం జగిత్యాల తహసీల్ చౌరస్తాలో అమరవీరుల స్థూపం చిత్రపటానికి పూలమాలలు వేసి పోలీసు అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. పోలీసు ఉద్యోగం కత్తిమీద సాములాంటిదన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కినపెల్లి కాశీనాథం, వేముల పోచమల్లు, బండాలి మల్లికార్జున్, కస్తూరి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



మేడిపల్లి: వేములవాడ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహరావు ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. మండలంలోని కట్లకుంట, తొంబరావుపేట, గుండ్లపల్లి, పోరుమల్ల గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్‌కు ఓటేయ్యాలని మహిళలు, యువకులు, కుల సంఘాలను కోరారు. అనంతరం ఆయా గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించారు. గుండ్లపల్లిలో 25 మంది యువకులు సర్పంచ్ సంపత్ ఆధ్వర్యంలో పార్టీలో చేరగా, వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్‌తో కలిసి బీఆర్‌ఎస్ పార్టీ ఆఫీస్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో హరిచరణ్ రావు, అంగడి ఆనంద్, అజిత్‌రావు, రావు శ్రీనివాస్, తన్నీరు శ్రీనివాస్, సత్తిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### సీడీ ఆవిష్కరణ

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ నోముల శేఖర్‌రెడ్డి శాసనసభ ఎన్నికల ప్రచార గీతంతో రూపొందించిన సీడీని శనివారం జగిత్యాల బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బోనగిరి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### ధర్మపురి టికెట్‌పై పునరాలోచించాలి

పెగడపల్లి: ధర్మపురి కాంగ్రెస్ అభ్యర్థి టికెట్ కేటాయింపు విషయంలో అధిష్టానం పునరాలోచన చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గజ్జల స్వామి అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. శనివారం పెగడపల్లిలో మాట్లాడారు. ధర్మపురి నుంచి తనకే కాంగ్రెస్ టికెట్ వస్తుందనే నమ్మకంతో రెండేళ్లుగా పార్టీ పటిష్టత కోసం కృషి చేసినట్లు తెలిపారు. ఇటీవల పార్టీ ప్రకటించిన కాంగ్రెస్ ఆరు గ్యారంటీ స్కీంలు, ప్రతి ఇంటికి తీసుకుపోయినా తనను అధిష్టానం గుర్తించక పోవడం బాధాకరమన్నారు. టికెట్ కేటాయింపు విషయంలో పార్టీ అధిష్టానంపై పునరాలోచిస్తుందన్న నమ్మకం, పూర్తి విశ్వాసం తనకు ఉందన్నారు. ఈ నెల 30 లోపు పార్టీ అధిష్టానం నుంచి ఎలాంటి స్పందన రాని పక్షంలో నియోజకవర్గంలోని తన భవిష్యత్ కార్యచరణ ప్రకటిస్తానని పేర్కొన్నారు. సమావేశంలో వివిధ మండలాల నాయకులు కొమురయ్య, అశోక్‌రెడ్డి, నందిరెడ్డి, స్వామి, రాజేశం, దేవేందర్‌రెడ్డి, జీకెరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా శివ పార్వతుల కల్యాణం



శివపార్వతులను ఊరేగిస్తున్న భక్తులు

కోరుట్ల రూరల్: మండలంలోని మాదాపూర్‌లో ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో దుర్గా శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఏడో రోజు శివపార్వతుల కళ్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేసి అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, జిల్లా సర్పంచుల ఫోరం గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, సింగిల్‌విండో చైర్మన్ గడ్డం ఆదిరెడ్డి, ఆదర్శ యూత్ సభ్యులు పాల్గొన్నారు.